ఈనాడు
అల్లూరి సీతారామరాజు
గురువారం 10 అక్టోబరు 2024


మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న జమాల్‌ఖాన్, నేతలు

అరాచకాలతోనే వైకాపా ఓడింది

చింతూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వైకాపా చేసిన అరాచకాల వల్లనే ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ బుధవారం నిమ్మలగూడెంలో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. జమాల్‌ఖాన్ ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు ఎంతో సేవ చేస్తున్నారని అభినందించారు. వైకాపా నాయకులు ఆయనను లక్ష్యంగా చేసుకుని వైద్యశాలలను మూయించారని, దీంతో వైకాపాకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధమై తెదేపాలో చేరారని గుర్తుచేశారు. వైకాపా రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోకపోవడంతో ప్రజలు విసుగుచెందారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి సేవలు చేస్తున్నారని వివరించారు. సమావేశం అనంతరం శబరి ఒడ్డు ప్రజలకు ఇళ్ల నిర్మాణాలకు రేకులు, ఇనుప చువ్వలను మంత్రి అందజేశారు. నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, నాయకులు సుభాని, నూరుబాషా కార్యదర్శి మౌలానాతోపాటు, జనసేన, భాజపా నాయకులు, నాలుగు మండలాల ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని చిత్తు చేయండిలా..



నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

ఈనాడు, పాడేరు, న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

మానసిక అనారోగ్యం అందరినీ ఇబ్బందులకు గురిచేస్తోంది. మానసిక ఎదుగుదల లేక ఇబ్బందులు పడుతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు పనిలో ఒత్తిడితో పెద్దలు సైతం మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు. వయసు పెరుగుతున్న నేపథ్యంలో మానసిక రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈనెల 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కథనం.

అనకాపల్లిలోని ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో ఉన్నట్టుండి అరవడం, కేకలు వేయడం చేస్తున్నాడు. ఇదివరకు ఆయన చాలా ప్రశాంతంగా ఉండేవారు. ఇప్పుడు ఈయన ప్రవర్తనలో మార్పు రావడంతో సైకాలజిస్టుకు చూపించుకోగా ఆయన కొన్ని సలహాలు ఇచ్చి మందులు వాడమని చెప్పారు.

» అనకాపల్లి ఆసుపత్రిలో ఇటీవల ఒక గైనకాలజిస్టు ఆశా కార్యకర్తలపై పెద్దగా కేకలు వేశారు. దీంతో ఆశా కార్యకర్తలంతా ఆందోళనకు దిగారు. తాను రెండు చోట్లకు ప్రసవాలు చేయడానికి పరుగులు తీయాల్సి వచ్చిందని, ఆ ఒత్తిడిలో అరిచి దురుసుగా ప్రవర్తించానని వైద్యురాలు ఆశా కార్యకర్తకు క్షమాపణ చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

» అనకాపల్లికి చెందిన ఎనిమిదేళ్ల కుర్రాడు మొండిగా తయారయ్యాడు. ఎవర్నికైనా ఎదురు చెప్పడం, దుర్భాషలాడడం, తగాదాలకు దిగడం చేస్తున్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకురాగా తల్లిదండ్రులు గొడవలు పడడం చూసి పిల్లలు ఇలా తయారైనట్లు గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.


చిన్నారులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

★ మునగపాకకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు అక్షరాలను రివర్స్‌లో రాస్తున్నాడు. ఇలా చాలాకాలంగా చేస్తున్నాడని అనకాపల్లిలోని బాలల సత్వర చికిత్స కేంద్రానికి తీసుకొచ్చారు. ఇదొక మానసిక రుగ్మత అని కౌన్సెలింగ్ ఇచ్చి చికిత్స అందిస్తున్నారు.

★ అనకాపల్లిలోని ప్రైవేటు ఫైనాన్స్ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తికి లక్ష్యాలు పూర్తిచేయక వస్తున్న ఒత్తిడితో ఆత్మహత్యకు యత్నించాడు. స్నేహితులు వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలను రక్షించి మరో ఉద్యోగంలో చేర్పించారు.

చిన్నా పెద్దా లేకుండా చాలామంది మానసిక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. పుట్టుకతో వచ్చిన లోపాలు, పెరుగుతున్న వాతావరణం మధ్య చిన్నారుల్లో మానసిక ఎదుగుదల లేక అనారోగ్యం పాలైనవారు కొందరు.. పని ఒత్తిడితో మానసిక అనారోగ్యానికి గురైన వారు మరి కొందరు.. యుక్త వయస్సు నుంచి పదవీవిరమణ పొందే వరకు సహచరులతో కలిసి ఉద్యోగం చేయాలి. ఇప్పుడు భార్య, భర్త ఉద్యోగం చేయడం పరిపాటిగా మారింది. శారీరక శ్రమ పెద్దగా లేకపోయినా మానసికంగా ఉండే ఒత్తిడితో అనారోగ్యానికి చాలామంది గురవుతున్నారని సైకాలజిస్టులు చెబుతున్నారు.

పనిచేసే ప్రదేశాల్లో ఒత్తిడి పెరుగుతోంది. ఒక సర్వే ప్రకారం ప్రతి పది మందిలో ఎనిమిది మంది ఒత్తిడికి గురవుతున్నట్లు తేలింది. వీరిలో నలుగురు వరకు మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు.

ఒత్తిడిని అధిగమించడానికి సహచరులతో మాట్లాడటం, కోపాన్ని తగ్గించుకోవడం, ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండటం మంచిది. ముఖ్యంగా ఆఫీసు విషయాలు ఇళ్లలో ప్రస్తావించకుండా, ఖాళీ సమయాల్లో కుటుంబ సభ్యులతో గడపాలని వైద్యులు చెబుతున్నారు.



టోల్ ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించొచ్చు

: ప్రస్తుతం పనిచేసే ప్రదేశాల్లో ఒత్తిడితో మానసిక అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది పనిచేసే ప్రదేశంలో మానసిక ఆనందం అందించాలన్న నినాదంతో ప్రచారం చేస్తున్నాం. మానసిక సమస్యలు ఉంటే చిన్నారులకు వైద్యంతో పాటు పెద్దలకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సను అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పీహెచ్‌సీలకు సైకాలజిస్టులను రప్పించి చికిత్స అందిస్తున్నాం. వైద్య సలహాల కోసం 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయొచ్చు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. వారు వైద్యం కోసం సలహాలు సూచనలు ఇస్తారు.

– డాక్టర్ ప్రశాంతి, ఎన్‌సీడీ పీవో



సకాలంలో గుర్తించాలి:

మానసిక ఎదుగుదల లేని చిన్నారులకు సకాలంలో గుర్తించి చికిత్సకు తీసుకురావాలి. అనకాపల్లి, నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలల సత్వర చికిత్స కేంద్రాలు ఉన్నాయి. మానసిక ఎదుగుదల లేని చిన్నారులు వారంలో పది మంది వరకు కేంద్రాలకు వస్తున్నారు. వీరికి చికిత్స అందిస్తున్నాం. కౌన్సెలింగ్ థెరపీ ద్వారా చిన్నారుల ప్రవర్తనలో మార్పు తీసుకురావచ్చు.

– డాక్టర్ క్రాంతి, చిన్నపిల్లల వైద్య నిపుణులు, డీఈఐసీ సెంటర్



పలు రైళ్లకు అదనపు బోగీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: దసరా పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు రైళ్లకు అదనపు బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ బుధవారం తెలిపారు. ఈనెల 9 నుంచి 16 వరకు విశాఖ - కోరాపుట్ (08546), విశాఖ-బ్రహ్మపుర (08532), ఈ నెల 10 నుంచి 17 వరకు కోరాపుట్-విశాఖ (08545), బ్రహ్మపుర-విశాఖ (08531) రైళ్లకు ఒక్కో సాధారణ రెండో తరగతి బోగీ జత చేయనున్నట్లు తెలిపారు.

★ ఈ నెల 10 నుంచి 17 వరకు విశాఖ-భవానీపట్నం (08504), ఈ నెల 11 నుంచి 18 వరకు భవానీపట్నం-విశాఖ (08503) రైళ్లకు రెండు సాధారణ రెండో తరగతి బోగీలు జత చేయనున్నామన్నారు.

★ ఈ నెల 11 నుంచి 17 వరకు విశాఖ-రాయ్‌పుర్ (08528), ఈ నెల 12 నుంచి 18 వరకు రాయ్‌పుర్-విశాఖ (08527) రైళ్లకు ఒక సాధారణ రెండో తరగతి బోగీ జత చేయనున్నామని ప్రయాణికులు గమనించి ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

యువత ఉపాధికి చేయూతనివ్వండి

పాడేరు, న్యూస్‌టుడే: రంపచోడవరం నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు పోలీసు శాఖ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కోరారు. ఎస్పీ అమిత్ బర్దార్‌ని బుధవారం ఎమ్మెల్యే, ఆమె భర్త, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపు గ్రామాల్లో పోలీసులు మంచి సేవలు అందించారని అభినందించారు. గంజాయి సమూల నివారణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నామని చెప్పారు.


ఎస్పీ అమిత్ బర్దార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శిరీషాదేవి దంపతులు

పాడేరులో నేడు ఆధార్ శిబిరం

పాడేరు, న్యూస్‌టుడే: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం పాడేరు పాత బస్టాండ్ కూడలిలోని డివిజన్ పోస్టల్ కార్యాలయంలో ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐపీ వై.దిలీప్ తెలిపారు. పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల పరిధిలో ఆధార్ కార్డు లేని వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు సేవింగ్, బీమా, సుకన్య సమృద్ధి యోజన పథకం సేవలు ఈ క్యాంపులో లభిస్తాయని చెప్పారు. ఆధార్ తీసుకునేవారికి సంబంధిత అర్హత ధ్రువపత్రంతోపాటు ఫోన్ నంబర్ కచ్చితంగా ఉండాలన్నారు.

బాలికపై బాలుడి అత్యాచారం

హుకుంపేట, న్యూస్‌టుడే: ఓ బాలికపై బాలుడు అత్యాచారం చేసిన ఘటన అల్లూరి జిల్లాలో చోటుచేసుకుంది. హుకుంపేట సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుకుంపేట మండలంలోని దిగుడుపుట్టు గ్రామానికి చెందిన ఓ బాలిక(15)ను గూడ గ్రామానికి చెందిన బాలుడు(16) ప్రేమ పేరుతో నమ్మించాడు. మంగళవారం రాత్రి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈమేరకు బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌ఛార్జి డీఎస్పీ వేణుగోపాలరావు బుధవారం గ్రామంలో విచారణ జరిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. నిందితుడు పరారయ్యాడని సీఐ తెలిపారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు.. సత్వర న్యాయం

చింతపల్లి, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. చింతపల్లి మండల పరిషత్తు సమావేశ మందిరంలో బుధవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయసేవాసాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకి ఉచిత న్యాయం అందించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, అక్షరాస్యతకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో మహిళలకు సత్వర న్యాయం ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్కిల్ పరిధిలో మహిళలపై ఇటీవల జరిగిన దాడులు, సంఘటనలపై నమోదు చేసిన కేసుల వివరాలను సీఐ రమేశ్ వివరించారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పీఓ రమణిల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఆర్‌డీఏ పీడీ మురళి, డీపీవో కొండలరావు, డీఈవో బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రజని, చింతపల్లి తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ ప్రసాద్, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నారసంచులు పంపిణీ చేస్తున్న సివిల్ జడ్జి వెంకటశేషమ్మ, డీఎంహెచ్‌వో, డీఈఓ

సరస్వతీదేవికి చిన్నారుల పూజలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం అమ్మవారు సరస్వతీ అలంకారంలో దర్శనమిచారు. చిన్నారులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం దుర్గాదేవి అవతారంలో దర్శనమివ్వనున్న నేపథ్యంలో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ప్రధానార్చకులు వెంకన్న తెలిపారు. ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకాలు, 9 నుంచి కుంకుమార్చన కార్యక్రమం చేస్తామన్నారు.

★ తహసీల్దారు కార్యాలయం సమీపంలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భవానీ పీఠం ఆధ్వర్యంలో మాలధారులు సాయంత్రం పట్టణ వీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగించారు.


అమ్మవారి రూపంలో బాలిక


ప్రత్యేక పూజలకు హాజరైన చిన్నారులు

ఏళ్లు గడుస్తున్నాయి.. ఇళ్ల నిర్మాణం కాలేదు


పోలవరం నిర్వాసితుల ఆందోళన


గోకవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితుల ఆందోళన

గోకవరం, దేవీపట్నం, న్యూస్‌టుడే

పోలవరం ప్రాజెక్టు కోసం మేము ఊరు, నమ్ముకున్న నేలను త్యాగం చేశాం. వాటిని వదులుకొని వస్తే గత వైకాపా ప్రభుత్వ హయాంలో కనీసం పట్టించుకోలేదని పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితులు కన్నీటి పర్యంతమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణునిపాలెం ఆర్‌అండ్ఆర్ కాలనీ నుంచి గోకవరం శివారు గంగాలమ్మ ఆలయ సమీపంలోని దేవీపట్నం పునరావాస కాలనీ వరకు బుధవారం నిర్వాసితులు భారీ నిరసన ర్యాలీ చేశారు. ప్రధాన రహదారి మీదుగా నినాదాలు చేస్తూ ఫ్లకార్డులతో శాంతియుతంగా ర్యాలీ సాగింది. దేవీపట్నం, పూడిపల్లి, వీరవరం, రమణయ్యపేట, మంటూరు, అగ్రహారం, మూలపాడు, పెనికెలపాడు, కొండమొదలు తదితర ఆరు పంచాయతీలకు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. వరద మా గ్రామాలను ముంచెత్తడంతో అప్పటి వైకాపా ప్రభుత్వం మీకు మెరుగైన ప్యాకేజీ అందించడంతో పాటు పునరావాస కాలనీని పూర్తి చేస్తామని నమ్మబలికి మమ్మల్ని బలవంతంగా ఖాళీ చేయించి రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గోకవరం వచ్చి మూడేళ్లు దాటుతున్నా ఇప్పటికీ కనీసం కాలనీలో ఇళ్ల నిర్మాణాలూ పూర్తికాలేదన్నారు. ఉపాధి లేక అద్దె ఇళ్లలో జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మండలంలోని 44 గ్రామాలు ముంపునకు గురయ్యాయని అన్ని ఆధారాలను చూపిస్తూ అర్హులుగా గుర్తించాలని గత వైకాపా ప్రభుత్వంలో రంపచోడవరం, ధవళేశ్వరంలో మూడేళ్లుగా తిరుగుతున్నామన్నారు. రంపచోడవరం వెళితే ధవళేశ్వరం వెళ్లమని, ధవళేశ్వరం వెళితే రంపచోడవరం వెళ్లమని తిప్పుతున్నారన్నారు. అర్హుల దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు. పోలవరం నిర్వాసితుల ర్యాలీకి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు (కొండమొదలు పంచాయతీ సర్పంచి) వేట్ల విజయ సంఘీబావం తెలిపారు. రైతుకూలీ సంఘం జిల్లా సహాయక కార్యదర్శి వంజం జోగారావు, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు వేట్ల సత్యనారాయణ, వేట్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేక ఇక్కట్లు



గత ప్రభుత్వం ఏవిధమైన ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఇళ్లను ఖాళీ చేయించింది. ఇంటి అద్దెకు ఏడాదికి రూ.36 వేలు చెల్లిస్తున్నాను. ఇప్పటికి ఒక్క రూపాయి చెల్లించలేదు. ఒక పక్క ఉపాధి లేక మరో పక్క అద్దెలు చెల్లించుకోలేక మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. దీంతో కొందరు సగం సగం పూర్తయిన ఇళ్లలోనే ఏదో విధంగా ఉండమని వచ్చేస్తుంటే ఇక్కడ కనీసం ఏవిధమైన వసతులు లేవు.

– బుర్రె ఆనందరావు, దేవీపట్నం

ఎలా బతికేది..?



కొండమొదలులో ప్రశాంతంగా బతికేవాళ్లం. ఇక్కడకు వచ్చిన తరువాత ఉండడానికి ఇళ్లు లేక చేయడానికి ఉపాధి పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. మాకు ఇచ్చిన ఇంటిలోనే అందరం ఉంటున్నాం. పెళ్లైన ఇద్దరు వారికి ఒకే ఇల్లు ఏవిధంగా సరిపోతుందని అధికారులే ఆలోచించాలి. ఇక ప్యాకేజీల కోసం ధవళేశ్వరం కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాం. తీరా ఇపుడు మేము ఇచ్చిన కాగితాలే కాలిపోయాయి అని చెబుతున్నారు.

– ఏడిద సరోజని, కొండమొదలు

కళ్లని ప్రేమించండి

నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

రాంబిల్లికి చెందిన మూడో తరగతి విద్యార్థి నోట్‌బుక్‌లో తరచూ తప్పులు రాస్తున్నాడు. సరిదిద్దుతున్న ఉపాధ్యాయిని ఆ విద్యార్థి బోర్డుపై రాసిన వాటిని నిర్లక్ష్యం రాస్తున్నాడని అనుకున్నారు. కొన్ని రోజుల తర్వాత బోర్డుపైన అక్షరాలు విద్యార్థికి సరిగా కనిపించడం లేదని గుర్తించారు. పరీక్ష చేయించి విద్యార్థికి కంటి అద్దాలు పెట్టించారు.

అనకాపల్లికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తున్నాడు. కళ్లు మసకగా కనిపిస్తున్నాయని కంటి వైద్యుడి వద్దకు వెళ్లగా కంటిపై ఎక్కువగా ఒత్తిడి వల్ల దృష్టి లోపం వచ్చినట్లు గుర్తించి కంటి అద్దాలు అమర్చారు.


ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు కంటి పరీక్షలు



ఎంతో మంది చిన్నారులు దృష్టి లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు వయసు మీరిన వారికే దృష్టి లోపం ఉండేది. ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా కంటి చూపు మందగించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ దృష్టి దినోత్సవం పురస్కరించుకుని ఈ ఏడాది విద్యార్థులు మీ కళ్లను ప్రేమించండి అన్న నినాదంతో నేత్ర వైద్యులు, సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలలకు వెళ్తే ప్రతి 20 మందిలో ఒకరికి కంటి అద్దాలు ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ సర్వే ప్రకారం ప్రతి లక్ష మందిలో 1000 మంది దృష్టి సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 2025 నాటికి దీని సంఖ్యను 300 వరకు తగ్గించాలన్న లక్ష్యంతో దృష్టి లోపం నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబరు వరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. సెప్టెంబరు నెలాఖరువరకు 23,198 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా వీరిలో 1157 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు విద్యార్థులకు ఇతర కంటి సమస్యలు ఉన్నట్లు తేల్చారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏడాదికి 12 వేల కంటి శుక్ల శస్త్రచికిత్సలే లక్ష్యం : దృష్టి లోపం నివారించేందుకు పెద్దల్లో కంటి శుక్లాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. ఏడాదికి 12వేల లక్ష్యంగా పెట్టుకుని శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అనకాపల్లి ఆసుపత్రితో పాటుగా శంకర్ ఫౌండేషన్, ఎల్వీ ప్రసాద్, గీతం, పాయకరావుపేటలోని హైమా నేత్రాలయం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శుక్లాల పరీక్షలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.


అనకాపల్లి ఆసుపత్రిలో కంటి శుక్లాల శస్త్రచికిత్స



సకాలంలో కంటి లోపాలు గుర్తించాలి: దృష్టి లోపం సమస్యలు పెరుగుతున్నాయి. చిన్నారులు సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడడం వల్ల దృష్టిలోపం వస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు అందిస్తున్నాం. అంధత్వ నివారణలో భాగంగా చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో దృష్టి లోపాన్ని గుర్తించి వైద్యం చేయించుకోవాలి. ఉచిత వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

– డాక్టర్ జీవీ రమణకుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్, అనకాపల్లి

గంజాయి, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీల సమావేశంలో డీఐజీ గోపినాథ్ జెట్టి


గోపినాథ్ జెట్టి

ఈనాడు, విశాఖపట్నం: గంజాయి రవాణా, సైబర్ నేరాల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీలకు డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు. విశాఖ రేంజి కార్యాలయం నుంచి ఐదు జిల్లాల ఎస్పీలతో బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. రేంజ్ పరిధిలో ఎక్కడా గంజాయి సాగు లేకుండా చూడాలని, వాటిని పండించే రైతుల జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం' అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమ రవాణాలో తరచూ పట్టుబడిన వారిపై పీడీ చట్టం ప్రయోగించాలన్నారు. దీపావళి నేపథ్యంలో బాణసంచా తయారీ కేంద్రాలను, గోదాములు తనిఖీలు చేసి భద్రతాప్రమాణాలు పాటిస్తుందీ లేనిదీ గుర్తించాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. సైబర్ నేరాలపై 1930 ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలను నియంత్రించడంలో భాగంగా ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 నంబరుకు ఫిర్యాదు చేసేలా ప్రచారం చేయాలన్నారు. బాలికలు, బాలురు అదృశ్యం కేసుల్లో అలసత్వం ప్రదర్శించకుండా కేసు నమోదైన వెంటనే వారి ఆచూకీ కనిపెట్టేలా ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఎస్పీలను ఆదేశించారు. సమావేశంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు దీపిక, అమిత్‌బర్దార్, వకుల్ జిందాల్, కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్వీ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఇద్దరికి బంగారు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్, హాకీ సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీల్లో ఎలమంచిలికి చెందిన ఇద్దరు క్రీడాకారులకు బంగారు పతకాలు లభించాయి. ఈనెల 6 నుంచి 8 వరకూ తిరుపతిలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. అండర్- 17 విభాగంలో నగిరెడ్డి రోహిత్, పోలవరపు సుస్మితలకు బంగారు పతకాలు లభించాయి. ఈ సందర్భంగా తైక్వాండో ఫౌండర్ నగిరెడ్డి సత్యనారాయణ, అంతర్జాతీయ క్రీడాకారుడు కొఠారు దొరబాబు విజేతలను అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని వీరికి సూచించారు. జనసేన జిల్లా కార్యదర్శి కొఠారు నరేష్, తైక్వాండో క్లబ్ గౌరవ అధ్యక్షులు ఎన్. దొరయ్య, ఉపాధ్యక్షులు కూరగాయల బుచ్చి తదితరులు వీరిని అభినందించారు.

రెజ్లింగ్ పోటీల్లో గుండుపాల విద్యార్థిని ప్రతిభ

గొలుగొండ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాల అండర్ 14-17 బాలికల రెజ్లింగ్ విభాగంలో గుండుపాల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి. వెంకటలక్ష్మి మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు విజయ కుమార్ తెలిపారు. ఈ బాలిక ఈనెల 3 నుంచి 5 వరకు కృష్ణాజిల్లా నున్నలో జరిగిన రాష్ట్రపోటీల్లో పాల్గొని రజత పతకం సాధించినట్లు చెప్పారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్మూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు ప్రకాష్‌రావు అభినందించారు.

ఆట్యా పాట్యా జాతీయ పోటీలకు ఎంపిక

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నం విద్యాంజలి పాఠశాల విద్యార్థులు ఆట్యాపాట్యా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల బృందానికి ద్వితీయ స్థానం దక్కింది. ఇందులోని ప్రతిభ కనబరిచిన కె. మధుప్రియ, ప్రియవర్షిణి, ఎన్. మధు 11 నుంచి పుదుచ్చేరిలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని పాఠశాల ఛైర్మన్ అక్షజ్, కరస్పాండెంట్ శాంతి ప్రత్యేకంగా అభినందించారు.


విద్యార్థిని వెంకటలక్ష్మి



జాతీయ పోటీలకు ఎంపికైన మధుప్రియ, ప్రియవర్షిణి, మధు

విజయదుర్గమ్మకు బంగారం, వెండి ఆభరణాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: హరిపాలెం హరిగిరి క్షేత్రంలో విజయదుర్గమ్మకు కాండ్రేగుల రామఅప్పారావు, అప్పలమణి దంపతులు రెండు తులాల బంగారు శతమానాలు, బీసెట్టి తేడు రాజు అన్నపూర్ణ దంపతులు 16 తులాల వెండి కాసుల పేరును బుధవారం అందించారు. పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వీరికి పలకలు, పెన్సిలు శివమణిశ్వరరావు దంపతులు సమకూర్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మారిశెట్టి సూర్యనారాయణ, సర్పంచి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.


హరిపాలెంలోని విజయదుర్గమ్మ


చోడవరంలో సరస్వతీదేవి అవతారంలో కనకదుర్గమ్మ

సామూహిక అక్షరాభ్యాసం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: చోడవరం కనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవారిని సరస్వతీదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హోమం, ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. స్వయంభూ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోడమంచిలి చలపతి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేశారు.

వెంకన్నకు గరుడ వాహన సేవ

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయంలో బుధవారం స్వామివారి గరుడ వాహన సేవ వేడుకగా సాగింది. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు, సుదర్శన పెరుమాళ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతోత్సవాన్ని నిర్వహించారు.


ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

కాలువ గట్టు కబ్జా

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్న రీతిలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. అధికారుల కనుల ముందే కబ్జాల బాగోతాలకు తెరలేపుతున్నారు. లక్షలాది రూపాయల విలువచేసే భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా పాగా వేస్తున్నారు. తాజాగా పాయకరావుపేటలోని తాండవ చక్కెర కర్మాగారం వద్ద ఉన్న భూమి కాలువ పక్కన ఉన్న స్థలాన్ని దర్జాగా కబ్జా చేశారు. పాయకరావుపేట నుంచి నర్సీపట్నం వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న జలవనరుల శాఖ స్థలంలో షెడ్డు వేసి, దాని చుట్టూ రేకులతో ప్రహరీ నిర్మించేశారు. అంతేగాక వ్యాపారం చేసుకునేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇదంతా ప్రధాన రహదారి పక్కనే చోటు చేసుకుంది. కాలువ గట్టు సహా లక్షలాది రూపాయల విలువ జేసే భూమిలో తిష్ఠ వేయడంపై పలువురు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జలవనరులశాఖ ఏఈ శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా స్థలం కబ్జా వాస్తవమేనన్నారు. తక్షణమే వీటిని తొలగిస్తామని చెప్పారు.


జల వనరుల శాఖ స్థలంలో షెడ్డు


రేకులతో ప్రహరీ

గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు

స్పష్టం చేసిన గిరిజనులు


ఖాళీ బిందెలతో నిరసన

రావికమతం, న్యూస్‌టుడే: కొట్నాబిల్లి రెవెన్యూలో గ్రానైట్ క్వారీ తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వొద్దని గిరిజన గ్రామాల ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. కొట్నాబిల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు-1లోని 3.219 హెక్టార్ల భూమిలో క్వారీ అనుమతుల కోసం ఆశ్రిత ఎంటర్ ప్రైజెస్ సంస్థ దరఖాస్తు చేసుకుంది. ప్రజాభిప్రాయ సేకరణకు నర్సీపట్నం ఆర్డీఓ వి.వి.రమణ, కాలుష్య నియంత్రణ మండలి జేఈ కరుణ కుమారి, తహసీల్దారు వెంకటరమణ సమక్షంలో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. కొట్నాబిల్లి, కె.గదబపాలెం, పాత కొట్నాబిల్లి, రామన్నదొరపాలెం గిరిజన గ్రామాల మహిళలు, ఎస్టీ, ఎస్సీ యువకులు ఈ సభకు హాజరై క్వారీ ఏర్పాటును వ్యతిరేకించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు మాట్లాడుతూ కొట్నాబిల్లి రెవెన్యూలో ఇప్పటికే 15 క్వారీలు ఉన్నాయని గుర్తు చేశారు. క్వారీల వల్ల నష్టమే తప్ప తమకు ఎలాంటి లాభం ఉండటం లేదని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని చెప్పారు. తాగునీరు కలుషితం అవుతోందని, వాయుకాలుష్యంతో వ్యాధుల బారిన పడుతున్నామని చెప్పారు. క్వారీ నుంచి వచ్చే దుమ్ము, ధూళితో పంటలు పండటం లేదని గిరిజన, దళిత యువకులు అప్పలరాజు, కన్నయ్య చెప్పారు. క్వారీల్లోని గ్రానైట్‌ను గ్రానైట్‌ను తరలించుకుపోవడమే తప్ప రోడ్లపై గోతులను బుగ్గివేసి కూడా పూడ్చటం లేదని గదబపాలెం గిరిజనులు ఈదల అప్పలనాయుడు తదితరులు చెప్పారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు మాట్లాడుతూ క్వారీల కారణంగా గిరిజనులు, గిరి గ్రామాలకు తీవ్ర నష్టం జరుగుతున్నందున కొత్తగా అనుమతి ఇవ్వరాదని కోరారు. ప్రజాభీష్టానికి విరుద్ధంగా అనుమతులు ఇస్తే ఊరుకునేది లేదని తెగేసి చెప్పారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆసరి వాసుగోవిందరావు, మరికొందరు క్వారీ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు అధికారులకు స్పష్టం చేశారు. దీంతో వ్యతిరేక వర్గీయుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. క్వారీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మెజారిటీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవడంతో క్వారీ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే అధికారులు వెనుదిరిగారు. గ్రామసభలో గొడవలు జరగకుండా కొత్తకోట సీఐ పర్యవేక్షించారు. రావికమతం ఎస్.ఐ. రఘువర్మ ఆధ్వర్యంలో 30 మందికిపైగా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: డీఎస్సీ (ఉపాధ్యాయ నియామక పరీక్ష)కు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి జనార్దనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సంస్థలు అభ్యర్థులకు ఉచితంగా వసతి కల్పించాలని, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిళ్లలో తరగతులు నిర్వహించాలన్నారు. దరఖాస్తులను ఈనెల 21లోపు సమర్పించవచ్చన్నారు.

జలవిహారిలో పర్యటకుల సందడి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మండలంలోని పర్యటక కేంద్రాల్లో సందర్శకులు సందడి చేశారు. దసరా సెలవులు కావడంతో పర్యటక కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. చాపరాయి జలవిహారికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అంజోడ సిల్క్‌ఫాం, కొల్లాపుట్టు జలతరంగిణిలను కుటుంబసమేతంగా సందర్శించి ఆనందంగా గడిపారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

అరకులోయ పట్టణం: గిరిజన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, ఎంపీపీ ఉషారాణి పేర్కొన్నారు. ఓల్డ్ స్టూడెంట్స్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ క్రీడాకారుల స్మారక జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీని పెదలబుడు సర్పంచి దాసుబాబుతో కలిసి ప్రారంభించారు. 60 జట్లు పాల్గొంటున్నట్లు అసోసియేషన్ ఛైర్మన్ మధుసూధన్‌రావు, బురిడి ఆనందరావు తెలిపారు. ఎంఈఓలు త్రినాథరావు, బాలాజీ, అసోసియేషన్ సభ్యులు బాబూరావు, రామారావు, తెదేపా, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 591 దరఖాస్తులు


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏసీ మహేష్‌కుమార్, సీఐ రాజారావు

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 40 మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 591 దరఖాస్తులు వచ్చాయని విశాఖపట్నం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన పాడేరులో విలేకరులతో మాట్లాడారు. 1/70 చట్టాన్ని దృష్టిలో పెట్టుకొని గిరిజన ప్రాంతంలో బార్లకు అనుమతి లేదన్నారు. పాడేరులో దుకాణాలకు 116, అరకులోయ 76, చింతపల్లి 76, రంపచోడవరం 111, చింతూరు 221 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. పెదబయలు మండలంలో రెండు దుకాణాలకుగాను రెండు, జి.మాడుగుల మండలంలో రెండింటికి మూడు దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈ నెల 11 వరకు గడువు పొడిగించినందున వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నెల 14న పాడేరులో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తామన్నారు. 16వ తేదీ నుంచి కొత్త దుకాణాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ ఎ.రాజారావు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతిఒక్కరికీ పరిహారం

గంగవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్మాణంలో నష్టపోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందిస్తామని సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. మండలంలో బుధవారం పర్యటించిన జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహారానికి సంబంధించిన వివరాలు స్థానిక తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక రెవెన్యూసిబ్బంది, సర్వేయర్లు ఉన్నారు.


అడ్డపల్లిలో వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, తహసీల్దార్, సిబ్బంది

కొండలపై కమ్ముకున్న మంచు


రంపచోడవరం-మారేడుమిల్లి ప్రధాన రహదారిలో..

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం నుంచి మారేడుమిల్లి వెళ్లే ప్రధాన రహదారికి చుట్టూ ఉన్న కొండలపై బుధవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఉదయం ఏడు గంటలు దాటినా ఈ మంచు తెరలు వీడలేదు. ఇక్కడికి వచ్చిన పర్యటకులు అందమైన మంచుకొండలను ఆస్వాదించారు. కొంత మంది సెల్ఫీలు దిగి ఉల్లాసంగా గడిపారు.

విద్యుత్తు సమస్యలపై 22 ఫిర్యాదులు



సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారులు

పాడేరు, న్యూస్‌టుడే: విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు సీజీఆర్‌ఎఫ్ సదస్సులు నిర్వహిస్తున్నామని సి.జి.ఆర్.ఎఫ్ ఛైర్మన్ డాక్టర్ బి. సత్యనారాయణ అన్నారు. బుధవారం పాడేరులో సీజీఆర్‌ఎఫ్ అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక బిల్లులు వస్తున్నాయని 16, ఇతర సమస్యలపై ఆరు ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పాడేరు ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి సీజీఆర్‌ఎఫ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విశ్రాంత న్యాయమూర్తి, సాంకేతిక సభ్యులు ఎస్.మసీలా మణి, డాక్టర్ సురేంద్ర కుమార్, జిల్లా ఎస్ఈ జి.ఎన్.ప్రసాద్, పాడేరు డివిజన్ ఏఈ ఏవీఎన్ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా వేతనాల్లేవ్

చింతపల్లి, న్యూస్‌టుడే: తమకు మూడు నెలలుగా వేతనాలు లేక పండగ నాడూ పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని సీహెచ్‌డబ్ల్యూ (కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు) ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షురాలు పద్మ చింతపల్లిలో సీహెచ్‌డబ్ల్యూలతో కలసి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా సుమారు 700 మంది వరకు సీహెచ్ డబ్ల్యూలు వేతనాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని విన్నవించారు.

భారీగా గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎస్సై నాగార్జున, పోలీసులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: చీడిపాలెం గ్రామ శివారులో 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు కొయ్యూరు ఎస్సై నాగార్జున బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారంతో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఆటోలో తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ మురగడపల్లి గ్రామానికి చెందిన పాంగి సత్తిబాబు, వంతల రాజుబాబు, వంతల సుబ్బయ్య, కిల్లో లేకులను అరెస్టు చేసినట్టుగా ఎస్సై తెలిపారు. వీరంతా ఆర్.వి.నగర్ నుంచి తునికి గంజాయి తరలిస్తున్నారన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు నాలుగు లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో అక్రమంగా 14.2 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు బుధవారం భద్రాచలం బస్టాండులో పట్టుకున్నారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయికి చెందిన రాంబాబు, లోవా అనే ఇద్దరు ఒడిశా నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తునట్లు భద్రాచలం ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. ఇద్దరికి చెందిన రెండు సంచుల్లో తనిఖీ చేయగా సుమారు రూ.2.15 లక్షల విలువైన గంజాయి లభ్యమైందని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

లంబసింగిలో మరిన్ని ప్రాజెక్టులు

చింతపల్లి, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలగకుండా ఆంధ్రాకశ్మీర్ లంబసింగిలో మరిన్ని అదనపు ప్రాజెక్టులు అమలు చేసేందుకు కృషి చేస్తానని ఏపీ పర్యటకాభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఛైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. బుధవారం లంబసింగి, తాజంగి, చెరువులవెనం ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇటీవల మన్యంలోని వంజంగి, చెరువులవెనం లంబసింగి ప్రాంతాలు ప్రాచుర్యం పొందాయన్నారు. ఇక్కడ సహజసిద్ధ అందాలను చూసి పర్యటకులు మంత్రముగ్ధులవుతున్నారన్నారు. వీరికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు పర్యావణానికి హాని జరగకుండా పూర్తిగా పాలిథిన్‌ను నిషేధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న గిరిజన యువతకు పర్యటక ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఏపీ పర్యటకశాఖ లంబసింగి మేనేజరు సూరిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.


లంబసింగిలో రిసార్టులు పరిశీలిస్తున్న ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, మేనేజరు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్డ్	199	230
స్కిన్‌లెస్	226	240

గిట్టుబాటు ధరల కల్పనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లాస్థాయి అధికారులు

పాడేరు, న్యూస్‌టుడే: అర్హత కలిగిన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీఓలు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, కాఫీబోర్డు, స్పైసెస్ బోర్డు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడానికి అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పాడేరు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ మాట్లాడుతూ.. 1.9 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారని, 75 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్ల దిగుబడి వస్తోందన్నారు. గత ఏడాది కాఫీ రైతులకు కిలోకు రూ.43 చెల్లించామని, దానికి అదనంగా మరో రూ.మూడు బోనస్‌గా అందిస్తున్నామని చెప్పారు. ఐటీడీఏ పీఓలు కట్ట సింహాచలం, అపూర్వ భరత్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్ నంద్, ఉద్యానాధికారి రమేష్‌కుమార్‌రావు, కాఫీ బోర్డు డీడీ రమేష్, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కళ్యాణి, జీసీసీ డీఎం సింహాచలం, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం..

మార్కెట్‌లో భగ్గుమంటున్న కూరగాయల ధరలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

కూరగాయలు ధరలు పెరగడంతో కొనేందుకు మార్కెట్‌కు వెళ్తే రూ.500 తీసుకెళ్లినా నాలుగు రకాల వచ్చే పరిస్థితి లేదు. నెల రోజులుగా ధరలు పెరుగుతూ.. నేడు సామాన్యులకు అందకుండా పోయాయి. వారపు సంతల్లో సైతం కూరగాయల ధరలు అధికంగానే ఉండటం సామాన్యులకు ఇబ్బందిగా మారుతోంది. నింగినంటుతున్న నిత్యావసరాల్లో కూరగాయలు కూడా తాజాగా చేరడంతో పేద, మధ్య తరగతి వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది...ఏం కొనలేం, ఏం తినలేం అన్న చందంగా పరిస్థితి తయారైంది.

మాంసాహారం సైతం..

కోడి, మేక మాంసం, చేపలు ధరలు సైతం పెరగడంతో మాంసాహారులు తినడం తగ్గిస్తున్నారు. కిలో కోడి మాంసం రూ 230 నుంచి 260 వరకు ఉంటే మటన్ ధర రూ 800 వరకు పలుకుతోంది. చేపల ధరలు ఇక చెప్పనక్కర్లేదు. దీంతో వాటి ధరలకూ రెక్కలు రావడంతో ఈ సారి కూరగాయలపై పడుతున్నారు.

అకాల వర్షాలు.. కోతుల బెడద

మన్యంలో సాధారణంగా కూరగాయల పంట సాగు అధికంగా ఉంటుంది. అయితే అకాల వర్షాల కారణంతో మొక్కలు కుళ్లిపోవడంతో ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగా లేవు. కొన్నిచోట్ల కోతులు పంటలను నాశనం చేస్తుండటంతో కొంతమంది అటుగా దృష్టి సారించడం లేదు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేసి తీసుకురావడం, స్థానిక ఉత్పత్తులు చాలకపోవడంతో ధరలకు రెక్కలొచ్చాయి.

కొత్తిమీర కొనలేకపోతున్నాం..

కూరగాయలు కొన్నప్పుడు కొద్దిగా కొత్తిమీర, కరివేపాకు అడగడం.. ఇవ్వడం పరిపాటి. ప్రస్తుతం కొత్తిమీర చిన్న కట్ట రూ 20, పెద్దది రూ 40 వరకు కొనాల్సి వస్తోంది. కరివేపాకు కావాలంటే రూ.10 చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. అల్లం కేజీ రూ. 100, మునక్కాడ ఒకటి రూ. 15 నుంచి రూ. 20 వరకు పలుకుతోంది. నిమ్మకాయలు అయితే చిన్నకాయ సైతం రూ. రెండు ధర పలుకుతుండటం గమనార్హం.



రాజవొమ్మంగిలో కూరగాయల దుకాణం

ధరలు కిలో ఒక్కింటికి రూపాయల్లో.....

కూరగాయలు	సెప్టెంబరు	అక్టోబరు
మునగ	80	130
వంకాయ	30	50
పచ్చిమిర్చి	50	50
బెండ	30	50
దొండ	30	40
టమాటా	50	100
క్యారెట్	40	60
బీట్‌రూట్	50	60
చేమదుంప	50	80
ఆనబకాయ (ఒకటి)	20	70

కార్తిక మాసం ముగిసే వరకు ఇదే పరిస్థితా?

కార్తీకమాసం నెల రోజులు అత్యధికంగా కూరగాయల వినియోగం ఉంటుంది. అప్పుడు కూడా భారీగా అన్నసమారాధనలు ఉంటాయి. అలానే అయ్యప్ప, శివ మాలధారణ దీక్షలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ధరల భారం కార్తిక మాసం చివరి వరకు కొనసాగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు దీనిపై దృష్టి సారించి కూరగాయల సరఫరా పెరిగేలా చర్యలు తీసుకుంటే ధరలు అనుకూలంగా ఉంటాయని ప్రజలు కోరుతున్నారు.

వచ్చే ఆదాయం వీటికే..

కూరగాయల ధరలు భారీగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నాం. వీటితోపాటు మిగిలిన నిత్యావసరాలు కూడా పెరుగుతున్నాయి, ధరలు పెరగడంతో వచ్చే ఆదాయంలో అధిక శాతం వీటికే పోతుంది. ప్రభుత్వం స్పందించి ధరలను నియంత్రించాలి
– ఎన్.సత్యవతి, గృహిణి, రాజవొమ్మంగి

ఏమీ కొనలేని పరిస్థితి

కూరగాయల ధరలతో పాటు నిత్యావసరకుల ధరలు అధికంగా పెరిగాయి. ధరల్లో పెరుగుదల తప్ప తగ్గడం కనబడటం లేదు. గతంలో రూ 500 కేటాయిస్తే నెలలో నాలుగు వారాలకు సరిపోయేవి. ప్రస్తుతం ఇంట్లో సాధారణ వాడకానికే రూ వెయ్యి వరకు దాటిపోతోంది. దినసరి కూలీలు, సామాన్యులు కూరగాయలను కొనలేకపోతున్నారు.– ఎన్.రమణమ్మ. గృహిణి, రాజవొమ్మంగి

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

స్పందనకు వందన



నందిమెట్టలో మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: నందిమెట్ట, కొత్తూరు గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. బుధవారం 'ఈనాడు'లో మూలకు చేరిన పథకాలు.. తాగునీటికి ఇక్కట్లు శీర్షికన వెలువడిన కథనానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది నందిమెట్ట గ్రామంలో గ్రావిటీ పథకానికి మరమ్మతులు చేపట్టారు. పైపులైన్లకు వాల్వులు అమర్చి వీధుల్లో ఉన్న కుళాయిలకు నీటిని సరఫరా చేశారు. ఇంటింటికి ఉన్న కుళాయిల నుంచి తాగునీరు సరఫరా చేయడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. కొత్తూరులో ఉన్న సౌరవిద్యుత్తు ఆధార నీటి పథకానికి మరమ్మతులు చేశారు. బావిలో కుంగిన ఒరలను తొలగించి కొత్తవి అమర్చారు.

అ వీ ఇ వీ

చేతి పంపుల ఏర్పాటు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలోని రామవరం పంచాయతీలో బుధవారం లక్ష్మీనగరం, చొప్పల్లి రెండు గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చడానికి రెండు చేతిపంపులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బోరింగ్ యంత్రాల వద్ద సర్పంచి కారం బుచ్చమ్మ, ఎంపీపీ కారం లక్ష్మి కొబ్బరికాయలు కొట్టారు. స్థానిక సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

యువతకు క్వారీలు కేటాయించాలి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మన్యంలోని క్వారీలను గిరిజన యువతకు కేటాయించి వారికి ఉపాధి కల్పించాలని తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న పల్లె పండగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు.

ఆదివాసీల గుడిసెలు కూల్చడం సరికాదు

ఎటపాక, న్యూస్‌టుడే: దేవస్థానం భూముల్లో నిర్మించుకున్న ఆదివాసీల గుడిసెలు కూల్చే ప్రయత్నం అపాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు దాసరి సాయన్న డిమాండ్ చేశారు. శ్రీరాంనగర్ కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. పురుషోత్తపట్నంలోని దేవస్థానం భూములలో 2006వ సంవత్సరం నుంచి ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీల ఇళ్లను భద్రాచలం దేవస్థానం ఈఓ కూల్చివేయాలనే చేస్తున్న ప్రయత్నాన్ని ఆపాలని కోరారు. ఇవే భూముల్లో గిరిజనేతరులు, కొన్ని బహుళ అంతస్తులు కూడా ఉన్నాయని వాటిని ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. నర్సింహారావు, వెంకటమ్మ, అంజలి, రుక్మిణి పాల్గొన్నారు.

గుంతల రోడ్డులో పడి ఒకరికి గాయాలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: భూపతిపాలెం జలాశయం సమీపాన గుంతల రోడ్డు వద్ద ద్విచక్ర వాహనదారుడు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాడు. మండలంలోని కాకవాడ గ్రామానికి చెందిన వ్యాపారి అర్జునుడు ద్విచక్ర వాహనంపై కాకవాడ నుంచి రంపచోడవరం వస్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదవశాత్తు రోడ్డు గుంతలలో పడ్డాడు. అటుగా వెళ్తున్న వారు అతనిని రంపచోడవరం ఆసుపత్రికి పంపించారు. పెదగెద్దాడ వెళ్తున్న ఈ రహదారిలో అడుగడుగున పెద్ద గుంతలుపడి ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

కార్యదర్శికి సత్కారం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గుమ్మకోట సచివాలయం పరిధిలో పనిచేస్తున్న కార్యదర్శి శ్రీనివాసరెడ్డి బదిలీ అయ్యారు. సర్పంచి పాగి అప్పారావు, సచివాలయం సిబ్బంది బుధవారం ఆయన్ను సత్కరించి వీడ్కోలు పలికారు. ఆయన సేవలను కొనియాడారు.

రికార్డుల తనిఖీ

జి.మాడుగుల, న్యూస్‌టుడే: సీఆర్‌పీలు ఆన్‌లైన్ పనులు పూర్తి చేయాలని డీఈవో బ్రహ్మాజీరావు అన్నారు. జి.మాడుగుల విద్యాశాఖ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సెలవుల్లోపు పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఎంఈవో బాబూరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: స్థానిక వాల్మీకిపేటలో పైపులైన్లు పగిలిపోయి నీరంతా వృథాగా పోతోంది. దీంతో రహదారిలో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.
– స్థానికులు, వాల్మీకిపేట, రంపచోడవరం

✓: వాల్మీకిపేటలో పైపులైన్లకు మరమ్మతులు చేయించి తాగునీరు వృథాగా పోకుండా చర్యలు చేపడతాం.
– నారాయణ, కార్యదర్శి, సచివాలయం, రంపచోడవరం.

సరస్వతీ నమస్తుభ్యం!

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక రంగా సెంటర్ వద్ద దుర్గమ్మతల్లి సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ బీవీకే పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. 25 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ప్రిన్సిపల్ ఆచార్యులు, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: సరస్వతీ దేవి రూపంలో ఏడో రోజు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఎటపాక, తోటపల్లి, నెల్లిపాక, గుండాలకాలనీ, నందిగామ, లక్ష్మీపురం, చోడవరం తదితర గ్రామాల్లో కొలువైయున్న అమ్మవార్లకు భక్తులు వారి చిన్నారులతో పుస్తక పఠనం చేపిస్తూ ప్రత్యేక పూజలు చేశారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి, జడ్డంగి, కింద్ర తదితర ప్రాంతాల్లో దుర్గాదేవి ఆలయాల వద్ద సామూహిక వ్రతాలు, సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు.



సీలేరులో సరస్వతి అలంకరణలో అమ్మవారు



పొల్లూరులో..



చింతపల్లి విజ్ఞానభారతి పాఠశాలలో అక్షరాభ్యాసం

రంపచోడవరం, న్యూస్‌టుడే: సీతపల్లి బాపనమ్మతల్లి ఆలయంలో ఈవో సత్యరమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రంపచోడవరం మార్కెట్‌వీధి, స్టేట్‌బ్యాంకు వద్ద ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు కొండపై వెలసిన కనకదుర్గమ్మ సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జీసీసీ మాజీ ఛైర్మన్ ఎంవీవీ ప్రసాద్, సర్పంచి బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు చిరంజీవి, దొరబాబు, చక్రరావు, ప్రభుదాస్, రాజశేఖర్, ఎం.రాజు, భవానీ భక్తులు గరగలను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సీలేరు: సీలేరు, ధారకొండలో అమ్మవారిని సరస్వతీదేవీగా అలంకరించారు. మండపాల వద్ద సరస్వతి పూజ నిర్వహించారు. చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మూలా నక్షత్రం సందర్భంగా చింతపల్లి విజ్ఞానభారతి పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కరస్పాండెంట్ గెమ్మల మోహన్ పాల్గొన్నారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగులలో భవానీ పీఠం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కుంకుమ పూజలు, అభిషేకాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రికి భవానీ భక్తులు అగ్నిగుండం తొక్కారు. సీఐ వెంకటరావు, ఎస్సై షణ్ముఖరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టులోని గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పొల్లూరు దుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేశారు. మోతుగూడెం డివిజన్ కార్యాలయంలో దుర్గమ్మను జెన్‌కో ఉన్నతాధికారులు భక్తిశ్రద్ధలతో పూజించారు.



సీతపల్లి బాపనమ్మతల్లి ఆలయంలో..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వడ్డిగూడెం శివాలయంలో అమ్మవారిని సరస్వతి అవతారంలో అలంకరించి, అర్చకులు పూజలు చేశారు. అర్చకులు పుస్తకాలను అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేశారు.

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక అలంకారాలను నిర్వహించి పూజకార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు చక్రవర్తి, వాడపల్లి శేషాచార్యులు, ఆలయ కమిటి సభ్యులు అబ్బాయిదొర, రమేష్, బుల్లిదొర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గంగవరంలో..

అమ్మవారి ఆలయం శుభ్రం

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గడంతో గండిపోశమ్మ ఆలయం వద్ద వరద ప్రవాహం క్రమంగా తగ్గింది. ఆలయ సిబ్బంది బుధవారం అమ్మవారి ఆలయ మండపాన్ని శుభ్రం చేశారు. వరద తగ్గుతున్న క్రమంలో ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం పాపికొండల విహారయాత్ర నిలిచిపోయింది.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

చింతూరు, న్యూస్‌టుడే: తమను విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు బుధవారం చింతూరులో వాలంటీర్లు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు నెలకు రూ. 10 వేతనాలు చెల్లిస్తామని వారిని విధుల్లో కొనసాగిస్తామని చెప్పిందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో నిర్వహించే కేబినెట్ సమావేశంలో వాలంటీర్ల వ్యవస్థపై నిర్ణయం తీసుకోనున్నారని చెప్పారు. సీఐటీయూ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు సీసం సురేశ్, వాలంటీర్ల రాష్ట్ర కమిటీ సభ్యుడు పొడియం జానీ పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులో రక్షణ కరవు

పెదబయలు, న్యూస్‌టుడే: మండలంలోని అడుగులపుట్టు వద్ద ప్రమాదకర మలుపులో రక్షణ గోడలు లేక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గత వైకాపా హయాంలో కుజుభంగి నుంచి చిట్రాయిపుట్టు వరకు రహదారి విస్తరించినా మలుపుల వద్ద రక్షణ గోడలు నిర్మించకుండా వదిలేశారు. ఈ మలుపు వద్ద రక్షణ గోడలున్నప్పటికి పలుమార్లు ప్రమాదాలు జరిగి పలువురికి గాయాలు కాగా.. కొంత మంది మృత్యువాత పడ్డారు. విస్తరణ కారణంగా రక్షణ గోడలు కూల్చేయడం, కొత్తవి నిర్మించకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామని అన్నారు.



అడుగులపుట్టు మలుపు వద్ద ఇలా..

మెరుగైన వైద్యసేవలు అందించండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: పెదగెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం కమిటీ ఛైర్మన్, ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన ఎంపీడీవో సుందం శ్రీనివాసు దొర మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. సర్పంచి వడగల ప్రసాద్, వైద్యులు వినోద్ కుమార్, ముఖేంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసు దొర తదితరులు

ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి సమావేశం

రంపచోడవరం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని తెదేపా సీనియర్ నాయకులు యనమల రామకృష్ణుడు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై కూటమి ఎమ్మెల్యేలు, నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని యనమల ఆధ్వర్యంలో సత్కరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు.



ఎమ్మెల్యే శిరీషాదేవిని సన్మానిస్తున్న యనమల

దివ్యాంగులకు వీల్‌ఛైర్ల పంపిణీ

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మన్యంలో ఆర్‌ఎస్ స్వేచ్ఛ సొసైటీ గిరిజనులకు స్వచ్ఛందంగా చేస్తున్న సేవలు అభినందనీయమని సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక పీఎమ్మార్సీలో రాజమహేంద్రవరానికి చెందిన ఆర్‌ఎస్ న్యూరో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహకులు డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో ఆర్‌ఎస్ స్వేచ్ఛ సొసైటీ వ్యవస్థాపకులు కంటా స్వాతి పది మంది దివ్యాంగులకు వీల్‌ఛైర్లు సమకూర్చారు. వీటిని సబ్‌కలెక్టర్ కల్పశ్రీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు, వైద్యసిబ్బంది, ప్రైవేటు డాక్టరు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వీల్‌ఛైర్లు అందిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ, స్వాతి

నవజాత శిశువు మృతిపై విచారణ

సీలేరు, న్యూస్‌టుడే: ఈనెల 6వ తేదీన దుప్పిలవాడ పంచాయతీ వలసగెడ్డ కాలనీకి చెందిన సొమరా దంపతుల శిశువు పూర్ణిమ మృతి చెందింది. సీలేరు పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీనిపై పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ బుధవారం విచారణ నిర్వహించారు. వైద్యాధికారి, స్టాఫ్ నర్స్, అంబులెన్స్ డ్రైవర్, ఎంఎన్‌వోతో మాట్లాడారు. బాధిత కుటుంబ సభ్యులు, దుప్పిలవాడ, సీలేరు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుడు పి.సాంబమూర్తితో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామని చెప్పారు. తహసీల్దారు ప్రసాద్, ఎంఆర్ఐ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని సహాయ కార్మిక శాఖ కమిషనర్ సుజాత, సహాయ కార్మికాధికారి సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆపరేషన్ స్వేచ్ఛలో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జి అధికారి ఆధ్వర్యంలో పాడేరు పట్టణంలోని హోటళ్లు, వస్త్ర దుకాణాలు, వాణిజ్య సముదాయాలను తనిఖీ చేశారు. బాలలను పనిలో పెట్టుకుంటే దుకాణ యజమానిపై రూ.20 వేల జరిమానాతో పాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాడేరు పట్టణంలోని అన్ని దుకాణాల్లో నిశితంగా తనిఖీలు చేశారు. కార్మిక శాఖ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా పోటీలు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా పోటీలు సాగాలని ఎంపీపీ కారం లక్ష్మి నిర్వాహకులకు, క్రీడాకారులకు సూచించారు. కుంజవారిగూడెంలో బుధవారం కొమరంభీం యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన విలీన మండలాల వాలీబాల్ పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొత్తం 25 జట్లు పాల్గొంటున్నాయని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని కమిటీ సభ్యులు రమేష్ తెలిపారు. ములకనపల్లి సర్పంచి సవలం మారయ్య, చిన్నబాబు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మి, చిత్రంలో క్రీడాకారులు, నిర్వాహకులు

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



నర్సమ్మ (ముంచంగిపుట్టు)



కొయ్యూరు తహసీల్దార్ కుమారస్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు తహసీల్దార్‌గా ఆర్‌వీఎస్‌ఎల్ నర్సమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జి.మాడుగుల మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ అదనపు బాధ్యతలపై తహసీల్దార్‌గా వ్యవహరించిన డీటీ అప్పలస్వామి పాడేరు పౌరసరఫరాలశాఖ డీటీగా బదిలీ అయ్యారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు తహసీల్దార్‌గా (ఎఫ్ఏసీ) కుమారస్వామి బాధ్యతలు స్వీకరించారు. గూడెంకొత్తవీధి మండలంలో హెచ్‌డీటీగా విధులు నిర్వహిస్తున్న ఈయన్ను ఇక్కడ నియమించారు. ఇప్పటివరకు డీటీ సీతారాం.. ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. నూతన తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

కాశీపట్నం సంతలో ట్రాఫిక్‌జాం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపట్నం వారపు సంతకు బుధవారం మైదాన ప్రాంతం నుంచి భారీగా వ్యాపారులు తరలిరావడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. సుమారు గంటపాటు విశాఖపట్నం- అరకు రహదారిలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దసరా సంత కావడంతో మేకలు, గొర్రెల విక్రయాలు అధికంగా సాగాయి.



రహదారిపై నిలిచిన వాహనాలు

నాబార్డు సాయంతో పండ్ల తోటల పెంపకం



చింతపల్లిలో సంతషెడ్లను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం చక్రధర్ తదితరులు

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో సుమారు 4,500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి నాబార్డు సాయం అందిస్తోందని నాబార్డు అల్లూరి జిల్లా అభివృద్ధి అధికారి (డీడీఎం)ఆర్.చక్రధర్ అన్నారు. నాబార్డు సాయంతో చింతపల్లిలో నిర్మించిన సంత దుకాణాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మాతోట పథకం ద్వారా నాబార్డు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా ఏడు చోట్ల మా తోట కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. రిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నెల్లూరి సత్యనారాయణ, ఎంపీపీ అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీ గోపీనాయక్ తిరుపతి, సర్పంచి దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి, న్యూస్‌టుడే: గిరిజన రైతులు సమగ్ర సస్యరక్షణ విధానాలు ఆచరించడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సాంకేతిక నిపుణులు అప్పలరాజు అన్నారు. ఉరిసింగి గ్రామంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావుతో కలసి వరిపొలాల్లో చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం మేనేజరు జ్యోతి, భరత్ పాల్గొన్నారు.

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చిరుధాన్యాల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అరకులోయ ఏడీఏ మోహనరావు అన్నారు. వైఎస్ఆర్‌పురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. రైతులు పండిస్తున్న రాగులు పంటలను పరిశీలించారు. పశువైద్యాధికారి గణేశ్వరరావు ఆధ్వర్యంలో 80 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సర్పంచి బడ్నాయిన సన్యాసమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్‌పురంలో 'పొలం పిలుస్తోంది'లో అధికారులు